టీఆర్‌టీకాలనీ సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఆర్‌టీ క్వార్టర్స్ ప్రతినిధులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ టీఆర్‌టీకాలనీలో కొంత కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కోరారు. ఆ మేరకు గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా పాడైపోయిన రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలన్నారు. పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కె.ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, టక్కర్, సునీల్, కె.సందీప్, వంశీకృష్ణ, ఎం.సందీప్, సాయినరేష్, జీవన్, కె.శివం, కె.తరుణ్, అక్షిత్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

గంగ తెప్పోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రతి సంవత్సరం నగరంలో నిర్వహించే గంగ తెప్పోత్సవ శోభయాత్రను విజయవంతం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. గురువారం తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించే శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గంగపుత్రుల్లో ఐక్యత పెంపొందించడంతో పాటు కులవృత్తులను కాపాడేందుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. తెప్పోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి బిజ్జి కనకేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఖైరతాబాద్‌లోని ఏడుగుళ్ల నుంచి ఊరేగింపు ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు నర్సింహ, రాజు, బాబురావు, రాములు, శేఖర్, కనకమ్మ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గంగ తెప్పోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బిజ్జి కనకేష్

దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పించాలని బేడ(బుడగ జంగం) హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్యం డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిరిగిరి మన్యం మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణలో ఉప కులాలకు తగిన న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ పోరాటం చేసి సాధించారని ఆయనకు మాదిగలంతా రుణపడి ఉంటారన్నారు.

◆ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్‌తో పాటు బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి కూడా తనవంతు పాత్ర పోషించిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా, ఉపకులాలకు సముచిత న్యాయం దక్కే విధంగా అమలు చేయాలన్నారు. విద్యా, ఉద్యోగాల్లో వర్గీకరణను అమలు చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎడవల్లి వీరప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటయ్య, కృష్ణయ్య, రాంబాబు, మల్లికార్జున్, దశరథం, రమేష్, రాజు, రాంగోపాల్, కృష్ణ, చంద్రం తదితరులు పాల్గొన్నారు.



బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి సమావేశంలో మాట్లాడుతున్న సిరిగిరి మన్యం

ప్రకృతి విపత్తులకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



సమావేశంలో మాట్లాడుతున్న డా.నక్క సాయిభాస్కర్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రకృతి విపత్తులు విళయాలకు ప్రభుత్వ నిర్లక్ష్యపు ధోరణే కారణమని సెంట్రల్ ఫర్ డ్రీమ్ రెవెల్యూషన్ కో–ఆర్డినేటర్ డా.నక్క సాయిభాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం మేల్కోనకపోతే భవిష్యత్‌లో మరిన్ని విపత్తులు సంభవించే ప్రమాదం ఉందన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులకు ''మానవ తప్పిదమా.? ప్రకృతి కోపమా?''అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రోనీ క్యాపిటలిజం ప్రకృతి విళయాలకు దారితీసిందన్నారు. ప్రతి దానిని లాభాపేక్షతో చూడటం వల్ల మానవ మనుగడకే ప్రమాదం వచ్చిందన్నారు. అందుకే ప్రకృతి విధ్వంసాన్ని నివారించడానికి ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. విపత్తులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణవేత్త లుబన్ సార్వత్, వ్యవసాయ శాస్త్రవేత్త సోమ వరళ, పర్యావరణవేత్తలు డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ నారాయణరావు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు బీఎన్ రెడ్డి, కార్యదర్శులు రాజా వెంకటరమణరెడ్డి, లింగస్వామి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల బాగోగులు మంత్రికి పట్టవా..?



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మికుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలోని కల్లుగీత కార్మికుల బాగోగులు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు పట్టవా అని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వి.వెంకటనర్సయ్యలు ప్రశ్నించారు. గురువారం కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ముకుందాపురం గ్రామంలో గీతా కార్మికుడు దేశగాని వెంకటేష్‌గౌడ్ ఆర్థిక ఇబ్బందులతో తాటి చెట్టుపైన ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఆయనను కిందకు దింపాలని మరో గీత కార్మికుడు నాగార్జునగౌడ్ చెట్టు ఎక్కుతుండగా ప్రమాదం జరిగి తీవ్ర గాయాలపాలయ్యారని తెలిపారు. గీతా కార్మికులను ప్రమాదాల నుంచి రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై లేదా అని ప్రశ్నించారు.

దశలవారీగా పైపులైన్ల ఆధునీకరణ

అంబర్‌పేట: నియోజకవర్గంలో దశల వారీగా పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం గోల్నాక డివిజన్ అన్నపూర్ణ నగర్‌లో రూ.8.90 లక్షల అంచన వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ లావణ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో కాలం చెల్లిన తాగు నీరు, డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను తొలగించి ప్రజావసరాలకు అనుగుణంగా పైపులైన్ అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే ప్రజలకు కావాల్సిన మౌళిక వసతులు కల్పనకు నిరంతరాయంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, బస్తీ నాయకులు పాల్గొన్నారు.



గోల్నాక అన్నపూర్ణ నగర్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

ప్రతిపాదిత పనులను ఆమోదించండి

నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించేందుకు పైపులైన్ వ్యవస్థ బలోపేతానికి సహకరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జలమండలి ఉన్నతాధికారులను కోరారు. గురువారం జలమండలి ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గ జలమండలి అధికారులతో కలిసి ఆయన ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు. జలమండలి ఆపరేషన్స్ విభాగం డైరెక్టర్ విజయ్‌రావుతో నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో జలమండలి అధికారులు కృష్ణ, మాజిద్, భావన, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



జలమండలి అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

శ్రీకృష్ణ జన్మాష్టమి పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆగస్టు 26న త్యాగరాయ గానసభలో శ్రీకృష్ణ వేషధారణ, సంగీత, శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకే చిన్నారులు ఈనెల 15వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని శిఖరం ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.94945 23562 సంప్రదించాలని కోరారు.

సూర్యప్రకాష్‌కు మల్టిపుల్ డిస్ట్రిక్-320 అవార్డు



సూర్యప్రకాష్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న డాక్టర్ బాబురావు

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌కు చెందిన లయన్ సూర్యప్రకాష్‌కు మల్టిపుల్ డిస్ట్రిక్–320 అవార్డు వరించింది. గురువారం కేవీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డా. బాబురావు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిస్వార్థంగా తమ వంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సునీల్‌కుమార్, లయన్ తీగల మోహన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

పార్థివాడ సమస్యలను పరిష్కరించాలి



పార్థివాడలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావని, నాయకులు

చిక్కడపల్లి: పార్థివాడలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వేంటనే పరిష్కరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అధికారులను కోరారు. గురువారం సాయంత్రం పార్థివాడలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించే విధంగా అన్ని శాఖల అధికారులతో కలిసి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ఎంఎస్ శ్రీనివాస్, రాఘవేంద్ర, రాము, ఎస్.రాజ్‌కుమార్, నిఖిల్, చందు, భాగ్యరేఖ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో సిటీ బస్సులు పెంచాలి



బస్ భవన్ ఎదుట జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ముషీరాబాద్: సిటీ బస్సులు పెంచాలని సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బస్సు భవన్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రసంగించారు. ప్రజా రవాణా వ్యవస్థను పెంచితేనే నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. అవసరమైన బస్సులు కొనుగోలు చేయాలని కోరారు. మెట్రో రైల్ బోగీలను 3 నుంచి 6కు పెంచాలన్నారు. ఎంఎంటీఎస్ లోకల్ రైళ్లను పెంచి సమయ పాలన పాటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, మహేందర్, దశరథ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనికేషన్ స్కిల్స్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది'

కెరీర్ గైడెన్స్ నిపుణుడు ఎన్వీ పార్థసారథి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కమ్యూనికేషన్ స్కిల్స్ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతో పాటు ఏ రంగంలోనైనా రాణించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయని ప్రముఖ కెరీర్ గైడెన్స్ నిపుణులు ఎన్వీ పార్థసారథి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో కేరీర్ అభివృద్ధిలో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాధాన్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ... ఎంత సబ్జెక్ట్ ఉన్నా, నైపుణ్యం ఉన్నా కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాల్సిందేనని అన్నారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్ ఉన్న వారికి విదేశాల్లో కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆర్.రిషికాంత్, రాజేష్ కుంద్రా, ప్రిన్సిపల్ డాక్టర్ మట్టా శేఖర్, కె.కవిత తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎన్వీ పార్థసారథి

అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణానికి సహకరిస్తాం

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణానికి వస్తున్న ఆటంకాలు తొలగించేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా తెలిపారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణంలో గోల్నాక చర్చి సమీపంలోని ఓ మసీద్ ప్రాంతంలో స్వల్ప వివాదం తలెత్తింది. దీనిపై సోషల్ మీడియాలో రకరకాల అంశాలు ప్రచారం అవుతుండటంతో ఆయన క్షేత్రస్థాయిలో గురువారం పర్యటించారు. ఆర్ అండ్ బీ, జీహెచ్‌ఎంసీ, పోలీస్ విభాగాల అధికారులతో పాటు సంబంధిత స్థానికులతో కలిసి క్షేత్రస్థాయిలో తలెత్తిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణంతో మసీదుకు ఎలాంటి నష్టం లేదని ఆయన తేల్చి చెప్పారు. కాగా మసీదు ప్రాంతంలో ఉన్న కొన్ని శ్మశానాల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కారించేందుకు కృషి చేస్తానన్నారు. సర్వీస్ రోడ్ సమస్య పరిష్కారానికి నిపుణులు, స్థానికులతో కలిసి చర్చించి సమస్య పరిష్కారానికి చొరువ తీసుకుంటానన్నారు.



గోల్నాకలో తలెత్తిన వివాదాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా, అధికారులు

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ వైఎస్ఆర్ పార్కు సమీపంలోని మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ యువజన కమిటీ నగర నాయకుడు ముఠా జైసింహ డిమాండ్ చేశారు. గురువారం క్రీడాకారుల ఫిర్యాదు మేరకు ముఠా జైసింహ, జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ డిఈ శ్రీకాంత్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తకుండా షెటిల్ కోర్టులో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్పందించిన శ్రీకాంత్ మాట్లాడుతూ వెంటనే ప్రతిపాదనలు రూపొందించి జోనల్ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న ముఠా జైసింహ

మహాత్మా గాంధీ శాంతి పురస్కార్ అవార్డుకు మర్రి రాజిరెడ్డి ఎంపిక



కాచిగూడ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. మర్రి రాజిరెడ్డి మహాత్మా గాంధీ శాంతి పురస్కార్–24కు ఎంపికైనట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీన క్విట్ ఇండియా డేను పురస్కరించుకొని అవార్డుతో సత్కరిస్తామని పేర్కొన్నారు. మర్రి రాజిరెడ్డి రెండు దశాబ్దాలుగా పర్యావరణ, శాంతి, జాతీయ సమైక్యత, మతసామరస్య, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నారని ఆయన తెలిపారు.

10, 11వ తేదీల్లో మెగా జాబ్ మేళా

కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ఇంటర్వ్యూలు

అంబర్‌పేట: నిరుద్యోగ యువతి, యువకుల కోసం మెగా జాబ్‌మేళాను ఈనెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్నారు. పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ (గ్రీన్‌లాండ్స్) హైదారాబాద్, రాంకీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ, జేఎన్‌టీయూల సహకారంతో జాబ్‌మేళాను చేపడుతున్నారు. సుమారు 10వేల ఉద్యోగాల భర్తీకి 100 సంస్థలు పాల్గొంటాయని పరావస్తు ఫౌండేషన్ అధ్యక్షుడు మధుకర్ స్వామి, జేఎన్‌టీయూ డైరెక్టర్ సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డీగ్రీ, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ, డిప్లొమా విద్యార్హత ఉన్న అభ్యర్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2016–24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. ఈ ఇంటర్వ్యూలు కూకట్‌పల్లి జేఎన్‌టీయూ క్యాంపస్ ఆవరణలో ఉదయం 10గంటల నుంచి ప్రారంభం అవుతాయన్నారు. అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 81212 12873, 73373 73575లలో తెలుసుకోవచ్చన్నారు.

ముషీరాబాద్ డివిజన్ సమస్యలు పరిష్కరించాలి



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లో నెలకొన్న జఠిలమైన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లోని బాపూజీనగర్ సమీపంలో చెత్త ఆటో రిక్షాలను నిలపడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్ల పునర్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.నవీన్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు జేఈ వ్యాక్సిన్ ఇప్పించాలి



రంగానగర్‌లో వ్యాక్సిన్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రాకేష్

ముషీరాబాద్: చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తిదని పెంపొందించేందుకు తప్పనిసరి టీకాలు ఇప్పించాలని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాకేష్ పేర్కొన్నారు. గురువారం చిన్నారులకు జేఈ వ్యాక్సిన్ వేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు లక్ష్మీబాయి, లత, ఆశావర్కర్లు హేమలత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి



హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాపంథా ప్రతినిధి బృందం

ముషీరాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలాన్ని, గృహ నిర్మాణానికి రూ.10లక్షలను అందించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి అన్మేష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నిటిని అమలు చేయాలన్నారు. ముఖ్యంగా పెన్షన్లు రూ.4వేలు అందించాలన్నారు. రైతాంగ రుణాల రద్దు, కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 21వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు ఎస్ఎల్ పద్మ, కేఎస్ ప్రదీప్, నాగేశ్వర్‌రావు, రామకృష్ణ, నల్లన్న, రవికుమార్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసిన మహనీయులను నిరంతరం స్మరించుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన 'హర్ ఘర్ తిరంగ'సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి బూత్‌లో జాతీయ జెండాను ఎగురవేయాలని అన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఒక్కరి ఇంటిపై జాతీయ జెండాను ఉంచాలని ఆయన సూచించారు. ఈనెల 12 నుంచి 14 వరకు మహనీయుల విగ్రహాలను శుభ్రం చేయాలన్నారు. ఈ నెల 11నుంచి 14వ తేదీ వరకు నియోజకవర్గాల వారీగా బైక్ ర్యాలీలు, 13న తిరంగా కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఆనంద్‌గౌడ్, కృష్ణగౌడ్, సందీప్ సాయి, శ్రీధర్, కార్పొరేటర్లు అమృత, కె.ఉమారమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. బీజేపీ హిమాయత్‌నగర్ డివిజన్ వర్కింగ్ కమిటీ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు కాకునూరు నర్సింగ్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ... డివిజన్‌లో ప్రజలు ముఖ్యంగా ఎదుర్కొంటున్న మంచినీరు, డ్రైనేజీ, అంగన్వాడీ సెంటర్, వీధి దీపాలు, రోడ్లు, తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎన్వీ సుభాష్, ఇంద్రసేనారెడ్డి, పి.ప్రసాద్, వెంకట్‌స్వామి, శ్రీధర్, మాధవి, నరహరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీవీ యాంకర్లకు అవార్డుల ప్రదానం



సాక్షి టీవీ యాంకర్ కవితకు పురస్కారం అందజేస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

చిక్కడపల్లి: టీవీ యాంకర్లు భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోవటం సులువు కాదని డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్–22వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు టీవీ, యూట్యూబ్ చానల్ యాంకర్లకు ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వేల మంది చూపులు టీవీ తెరపై యాంకర్లను గమనిస్తూ ఉంటారన్నది వాస్తమని వారు దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. సాక్షి టీవీ కవిత, టీవీ–9 పూర్ణిమ వేల్పుల, టీవీ–5 భవ్య, దూరదర్శన్ అల్పాన, స్వాతంత్ర్య శ్రీదేవి, వనిత శిరీష, మహా టీవీ త్రిపుర, ఏబీఎస్ నీలిమరాణి, బిగ్–టీవీ షేక్ సుల్తానాకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు చిల్ల రాజశేఖర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, రచయిత్రి గిడుగు కాంతికృష్ణ, అమెరికన్ ఇంజినీర్ శ్రీకాంత్, వీరబోగ వసంత, సంస్థ స్థాపకుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.